క్లుప్తంగా

అడవివరం కోఆపరేటివ్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ



సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 2023 క్యాలెండర్‌ను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. భీమిలిలోని ముత్తంశెట్టి క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, డైరెక్టర్లు బోర ప్రసాద్‌రెడ్డి, ఆకుల నాగరాజు, కోరాడ ఈశ్వరరావు, లండ వెంకటరమణ, పాలూరి సూరిబాబు, సొసైటీ ఉద్యోగి గంట్ల కిరణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

పరవాడ: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఈ.బోనంగి, గొర్లివానిపాలెం గ్రామాల్లో కొలువుదీరిన భూసమేత శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచి ఉత్తర ద్వార దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు చెప్పారు. పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న కీర్తి పట్నాయక్

సింహాచలం: నూతన సంవత్సరం పురస్కరించుకుని శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వేపగుంటలోని గంగిరెద్దుల కాలనీలో నిరుపేద పేదలకు చీరలు పంపిణీ జరిగింది. 30 మంది మహిళలకు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తిపట్నాయక్ చీరలు అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆమె తెలిపారు.

బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మహలక్ష్మినాయుడు




బొడ్డేటి మహలక్ష్మినాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని ఆరిపాక శివారు పెదయాతపాలేనికి చెందిన బొడ్డేటి మహలక్ష్మినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు రాంపురంలోని తన కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శాలువాతో సత్కరించి మహలక్ష్మినాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ప్రారంభం నుంచి సేవలు అందించిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్,ఆరిపాక ఉపసర్పంచ శరగడం శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరరావు, పార్టీ నాయకులు పాలమరశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

పరవాడ: అనకాపల్లి–గాజువాక రహదారిలో లంకెలపాలెం కూడలి సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో అనకాపల్లి గవరపాలేనికి చెందిన పాలమరశెట్టి హిమకర్(19) దుర్మరణం చెందాడు. పరవాడ ఎస్‌ఐ మల్లేశ్వరరావు అందించిన వివరాలు... గవరపాలేనికి చెందిన మృతుడు హిమకర్‌తో మరో ముగ్గురు వ్యక్తులు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై విశాఖ ఆర్‌కే బీచ్‌కు వెళుతున్నారు.ఈ క్రమంలో వారు లంకెలపాలెం జీవీఆర్ లేఅవుట్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం హిమకర్ వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక కూర్చున్న హిమకర్ తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. మృతదేహానికి ఆదివారం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గృహ నిర్మాణాలు చకచకా!



పరవాడలో తుదిదశలో జగనన్న గృహ నిర్మాణాలు



కలపాకలో శరవేగంగా సాగుతున్న జగనన్న ఇళ్లపనులు

- జగనన్న కాలనీల్లో సందడి
- 270 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- వివిధ దశల్లో 670 ఇళ్లు

పరవాడ: మండలంలో నిరుపేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలో ని ఈ.బోనంగి, కలపాక, పి.బోనంగి, గొర్లివానిపాలెం, పరవాడ, వెన్నలపాలెం, తిక్కవానిపాలెం–1 గ్రామ పంచాయతీల లేఅవుట్లలో లబ్ధిదారులకు 940 జగనన్న ఇళ్లు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 270 ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేశారు. మరో 670 ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు చకచకా పూర్తి చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. వెన్నలపాలెం, పరవాడ గ్రామాల్లో పలువు రు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు కూడా చేశారు. మండలంలో పరవాడ, వెన్నల పాలెం గ్రామ పంచాయతీలకు మంజూరైన 374 ఇళ్లలో 175 గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకొని మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాయి. మరో 199 ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాల్లో ఈ.బోనంగి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక్కడ లేఅవుట్‌లో 82 ఇళ్లు మంజూరు కాగా 35 పూర్తి కాగా 47 ర్మాణ పనులను లబ్ధిదారులు చేపడుతున్నారు. ఇక గృహ నిర్మాణాల ప్రగతిలో మూడో స్థానంలో కలపాక గ్రామం నిలిచింది. ఇక్కడ 95 ఇళ్లలో 29 పూర్తయ్యాయి. 66 ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణ పనులకు అవసరమైన మెటీరియల్‌ను సరఫరా చేయడంలో ప్రభుత్వం చొరవ చూపడంతో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతి న పూర్తి చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

గ్రామం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	వివిధ దశల్లో
ఈ.బోనంగి	82	35	47
కలపాక	95	29	66
పి.బోనంగి	48	8	40
గొర్లివానిపాలెం	100	11	89
పరవాడ/వెన్నలపాలెం	374	175	199
తిక్కవానిపాలెం	241	12	229
మొత్తం	940	270	670

చురుగ్గా గృహ నిర్మాణ పనులు



లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుము వంటి మెటీరియల్‌ను ప్రభుత్వం నిర్ణీత సమయంలో సరఫరా చేస్తుంది. మెటీరియల్ వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తు న్నాం. ఫలితంగా పలు చోట్ల గృహ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయి. మంద గొడిగా సాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను వేగ వంతం చేయడానికి చర్యలు తీసుకొంటున్నాం.

– ఎం.ఎస్.ఎస్.ఎన్ రెడ్డి, ఏఈ గృహ నిర్మాణశాఖ

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



సింహగిరిపై తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



వెంకటాద్రిపై పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

సింహాచలం: ధనుర్మాసంతో పాటు నూతన సంవత్సరం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్ పత్తు ఉత్సవాల్లో సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో వేంచేయజేశారు.ఆలయ బేడా మండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. అలాగే ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోదాదేవి తిరువీధి నిర్వహించి హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఈపూజలు నిర్వహించారు.

– శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి విశేష అలంకరణ చేసి వేదికపై అధిష్టంపజేశారు. పాశుర విన్నప పారాయణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు పూజలు నిర్వహించారు.

వెంకటాద్రిపై..

పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. పలు రకాల పదార్థాలను అమ్మవారికి ఆరగింపు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు పూజలు చేశారు.

అభివృద్ధి పనులపై స్వామీజీతో చర్చ



స్వరూపానందేంద్రతో చర్చిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు శ్రీనివాసరావు, దినేష్‌రాజ్

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరుపానందేంద్ర సరస్వతిని ఆదివారం సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సింహాచలం దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధిపనులతో పాటు గోశాలలో రూ.17లక్షలతో సంపంగి శ్రీనివాసరావు నిర్మించిన షెడ్ ప్రారంభోత్సవంపై చర్చించారు. గోవుల సంరక్షణార్థం సొంత నిధులతో షెడ్ నిర్మించిన సంపంగి శ్రీనివాసరావును ఈసందర్భంగా స్వామీజీ అభినందించారు. ఆలయ విశిష్టత మరింత పెంచే కార్యక్రమాలు చేపట్టాలని స్వామీజీ సూచించారు.దర్శనాల్లో సామన్య భక్తులకు పెద్దపీట వేయాలన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు



విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడుకు శుభా కాంక్షలు తెలుపుతున్న బ్రహ్మకుమారీస్



సింహాద్రిలో కేక్ కట్ చేస్తున్న ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, అధికారులు



ఎంపీడీవో రమేష్ నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సచివాలయ సిబ్బంది



పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న వలంటీర్లు, అధికారులు

పరవాడ/సింహాచలం/సబ్బవరం: నూతన సంవత్సర వేడుకలను నియోజకవర్గ ప్రజలు శనివారం ఉత్సాహంగా చేసుకున్నారు. యువత ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో ఆటపాటలతో సందడి చేశారు. న్యూఇయర్ పురస్కరించుకొని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతికి పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైఎస్సార్ సీపీ నేతలు చుక్క రామునాయుడు, సిరపరపు అప్పలనాయుడు, చల్లా కనకారావు, బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, తదితర ముఖ్య నాయకులు స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

➡ సింహాద్రి ఎన్టీపీసీలో నూతన సంవత్సర వేడుకలను సంస్థ యాజమాన్యం ఆదివారం ఘనంగా నిర్వహించింది. దీపాంజలినగర్‌లో సంకల్ప భవన్‌లో సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా కేక్ కట్ చేసి ఉద్యోగులకు తినిపించారు. కార్యక్రమంలో యూఎఫ్‌ఎస్‌ఈ సీజీఎం బి.రామారావు, సీజీఎం ఎస్.గోవిందరాజన్, జీఎం, హెచ్‌వోడీలు, సింహాద్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

➡ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజుకు ఆదివారం ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, పంచాయతీ కార్యదర్శులు వలంటీర్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సబ్బవరంమండలంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రజాప్రతినిధుల కార్యాలయాలు సందడిగా మారాయి. మండలంలోని పలు శాఖల అధికారులు. సిబ్బం రాంపురంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సబ్బవరంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ నాయుడుతో పాటు తహసీల్దార్ ఇతర అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పింఛన్.. ఆనందం పంచెన్



వెంకటపతిపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వాడచీపురుపల్లిలో పింఛన్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

కొత్త సంవత్సర కానుకగా పింఛన్ పెంపు

పరవాడ: అవ్వా తాతల కళ్లలో ఆనందం కనిపించింది. నూతన సంవత్సరం రోజున కొత్త పింఛన్ అందుకున్న వారు సంతోష పడ్డారు. పెంచిన పింఛన్లను వలంటీర్లు ఆదివారం ఉదయం 6 గంటలకే లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమానికి నడుం బిగించారు. వలంటీర్లతో కలిసి ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పింఛన్‌సొమ్ము అందజేశారు. మళ్లీ జగన్‌బాబు రావాలని వారంతా ఆశీర్వదించారు.తమకు పెద్దదిక్కులా మారాడనికి అవ్వాతాతలు ఆనందపడ్డారు. మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో కూండ్రపు సీతారామయ్య లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజాన ముత్యాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు కృష్ణబాబు, కె.దాదా నాయుడు, బండారు శ్రావణ్, రొంగలి గంగరాజు, యమహానాయుడు, కె.అప్పలనాయుడు, దొడ్డి రాజేష్, మాసవరపు సత్యవతి, వలంటీర్లు పాల్గొన్నారు.

➡ వాడచీపురుపల్లిలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీటీసీ పుష్పా చంద్రారావు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, పార్టీ కన్వీనర్ కూండ్రపు తాతాజీ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

➡ రావాడ గ్రామంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు కావలి వాసు, కావలి రాజు, పల్లా గోవిందు తదితరులు పెంచిన రూ.2750 పింఛన్ లబ్ధిదారులకు అందజేశారు.

194 కొత్త పింఛన్ల మంజూరు



వి.హేమసుందర్రావు, ఎంపీడీవో, పరవాడ

పరవాడ: మండలంలో 194 లబ్ధిదారులకు కొత్త పింఛన్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. కొత్తగా మంజూరైన పింఛన్లను ఈ నెల 4న పరవాడ సంతబయలులో ఉదయం 9 గంటలకు పింఛన్ల వారోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటున్నారని తెలిపారు.

అలరించిన ఆదివాసీ, జానపద నృత్యాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహిస్తున్న సరస్ డ్వాక్రా బజార్‌లో ఆరో రోజు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో సరస్‌కు నగర ప్రజలు విచ్చేశారు. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు, అభినయాలలో మంత్రముగ్దులను చేశారు. విద్యార్థుల ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ చిన్నారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ఉర్రూతలూగించాయి. అక్తర్ ఇంద్రజాల ప్రదర్శన, వెంట్రిలాక్విజం కడుపుబ్బ నవ్వించింది. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వేదికపై డీఆర్‌డీఏ పి.డి.శోభారాణి కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు.

ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ కలయికలో పాల్గొన్న స్టీల్ ఓబీసీ నాయకులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. ఈనెల 7న జరగనున్న స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా నెహ్రూ పార్కులో మహాత్మా జ్యోతిరావు పూలే ప్యానల్‌కు చెందిన కార్యవర్గ సభ్యులు, విభాగాల సమన్వయకర్తలు, విభాగ కమిటీల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమార్థం ఐదేళ్లుగా తమ కార్యవర్గం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్యానల్ గెలిపిస్తే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో అడహాక్ కమిటీ నాయకులు కోమటి రవిశంకర్, నక్క వెంకటరమణ, నెల్లి అప్పలరాజు, పిల్లి చంద్రరావు, నమ్మి తాతారావు, డాక్టర్ కాంబ్లే, కళ్యాణి, వి.ఎం. నాయుడు, నమ్మి సత్యనారాయణ, పి. గోవిందరాజులు, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దయాల్‌బాగ్ వర్సిటీ ఎడ్యుకేషన్ డే



విశాలాక్షినగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రార్థన చేస్తున్న సభ్యులు

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ వర్సిటీ ఎడ్యుకేషనల్ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రార్థనలు చేశారు. అనంతరం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంత ఆచార్యుడు పి.రామకృష్ణారావు మాట్లాడుతూ దయాల్‌బాగ్ వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణల గురించి వివరించారు. 2017 జనవరి 1న వర్సిటీ ప్రారంభం కావడంతో ప్రతి సంవత్సరం అదే రోజున ఎడ్యుకేషన్ డేగా జరుపుకొంటున్నామన్నారు. ఇక్కడ వృత్తిపరమైన కోర్సులు తక్కువ ఫీజులతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రెస్ డిజైనింగ్, టైలరింగ్, టెక్స్‌టైల్స్, బ్లాక్ ప్రింట్, అంబ్రెడ్డింగ్, టై అండ్ డై కోర్సు, బైక్ మెకానిక్, ఎలక్ట్రికల్ వర్క్స్ తదితర కోర్సులు నేర్పుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, సభ్యులు, పలు కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ రోగుల నిధికి హెచ్‌ఎం సంఘం సహకారం



టీబీ రోగుల నిధి కోసం డీఈవో చంద్రకళకు విరాళం అందిస్తున్న హెచ్‌ఎంల సంఘం ప్రతినిధులు

ఆరిలోవ: జిల్లాలో ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు డీఈవో ఎల్.చంద్రకళకు ఆదివారం వినూత్నంగా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. బొకేలు, పండ్లు, స్వీట్లతో కాకుండా కొత్త సంవత్సరంలో కొత్తదనం చూపించారు. కలెక్టర్ మల్లికార్జున పిలుపు మేరకు టీబీ రోగుల నిధి కోసం జిల్లా హెచ్‌ఎంల సంఘం ప్రధాన కార్యదర్శి కె.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పలువురు హెచ్‌ఎంలు డీఈవో చంద్రకళను ఆమె చాంబరులో కలిసి రూ.5 వేలు చెక్కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారిని డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో గౌరీశంకర్, పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతనోత్తేజంతో ఉక్కు ఉద్యమం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం: నూతన సంవత్సరంలో నూతనోత్తేజంతో ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద 689వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, పి.శ్రీనివాసరాజు, నమ్మి రమణ, జి.శ్రీనివాస్ , ఒప్పంద కార్మిక సంఘం ప్రతినిధులు నందికి తాతారావు, పిట్టా రెడ్డి, పి.నారాయణ, సన్యాసిరావు, పి.మహేష్, యు.సోమేష్, చట్టి నరసింగరావు, శ్యాంసుందర్, సిహెచ్.రాము, సింహాచలం, సోమినాయుడు, ఎస్.పైడిరాజు, వి.సోమేష్ పాల్గొన్నారు.